క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ పర్యటన



సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లి, పెద్దబజారు, రావువారి వీధి, ప్రధాన రహదారి ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి శనివారం పర్యటించారు. ఈ నెల 19, 20, 21వ తేదీల్లో గొల్లపల్లిలో దాడితల్లి, పాతబొబ్బిలిలో సరేపోలమ్మ పండగలు జరుగుతున్న నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. సిరిమాను తిరుగాడే ప్రాంతాలను పరిశీలించి, రోడ్లపై నిర్మాణ సామగ్రి ఉండకుండా చూడాలని సూచించారు. అలాగే సిరిమాను తిరువీధి జరిగే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆమె వెంట టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వరప్రసాద్, పర్యావరణ ఇంజినీర్ సోమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మండలంలోని గొర్లెసీతారాంపురంలో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని, తాను మరోసారి ఎమ్మెల్యేగా గెలవాలని భగవంతుడిని వేడుకున్నారు. అనంతరం అక్కడి నుంచి రామభద్రపురం, బాడంగి మండలాల్లోని పార్టీ నాయకులను కలిసేందుకు వెళ్లారు. ఆయన వెంట ఏఎంసీ డైరెక్టర్ అల్లు త్రినాధనాయుడు, బమిడిపాటి విశ్వనాధ శర్మ, తెర్లాం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు తదితరులు ఉన్నారు.

పుస్తక పఠనంతో అపార జ్ఞానం



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానం సిద్ధిస్తుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయానికి శనివారం విచ్చేసిన విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. పుస్తకాలు ఎలా చదవాలి, అందులో విషయాలను ఎలా గ్రహించి, అర్థం చేసుకోవాలన్న విషయాలను తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తకాలు చదవడాన్ని అలవాటుగా చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పుస్తకాలు చదివిన ఎంతోమంది జ్ఞానవంతులుగా వెలుగొందారన్నారు.

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులకు పిండ్రంగివలసకు చెందిన ఉపాధ్యాయుడు రవిబాబు స్పోకెన్ ఇంగ్లిష్‌పై ఆసక్తి రేకెత్తించేలా ఆంగ్ల పదాలు నేర్పించారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో నవధాన్యాల సాగుపై శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ పి.సురేష్ మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేయడం ద్వారా నేలసారం బాగా పెరిగి, పంట దిగుబడులు అధికంగా వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ వరలక్ష్మి, లక్షుంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్యామలాకుమారి

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రభుత్వ పథకాలపై ఎలాంటి చర్చలు జరగలేదు. ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావులు కార్యక్రమంలో పాల్గొని, అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీడీవో శ్యామలాకుమారి, తహసీల్దార్ రాములమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యం

● ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బాడంగిలో పార్టీ నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే శంబంగి



రామభద్రపురంలో పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం మరోసారి ఖాయమని, వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ధీమా వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతిలుతో కలిసి మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశమైన ఆయన.. తొలుత పార్టీ, తన గెలుపు కోసం కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలని తెలిపారు. అనంతరం గ్రామాల వారీగా పోలైన ఓట్లు, వైఎస్సార్ సీపీకి పడిన ఓట్లు వివరాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనూ నియోజకవర్గంలోనూ మన వైఎస్సార్ సీపీ మంచి మెజార్టీతో గెలుస్తున్నామని కార్యకర్తలెవరూ అందోళన చెందాల్సిన పని లేదన్నారు. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమానికి కృతజ్ఞతగా ప్రజలు అధికంగా ఓటింగ్‌కు వచ్చారన్నారు. జగనన్న మళ్లీ గెలిస్తేనే మనకు మంచి రోజులన్న భావనతో వారంతా ఫ్యాన్‌కు ఓట్లు వేశారన్న నమ్మకం నాకుందన్నారు. జూన్ 4వ తేదీన విడుదలయ్యే ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించడం ఖాయమని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు దర్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శనివారం సమావేశమై, ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి, ఎన్నికలు జరిగిన విధానం, పోలింగ్ సరళిపై సమీక్షించారు. ఏ గ్రామం నుంచి ఏ పోలింగ్ బూత్ నుంచి వైఎస్సార్ సీపీకి ఎక్కువగా ఓట్లు పోలయ్యాయని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల వారీగా నాయకుల నుంచి వచ్చిన రిపోర్టు చూస్తే ఈ మండలం నుంచి పార్టీకి మెజార్టీ వస్తుందన్న విషయం స్పష్టమైందన్నారు. మనం తప్పకుండా గెలుస్తామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, పార్టీ మండల అధ్యక్షుడు బి.వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన బోర్ల మరమ్మతులు



తాగునీటి బోరు బాగు చేస్తున్న మెకానిక్‌లు

వంగర: మండల కేంద్రంలోని మూడు తాగునీటి బోర్ల మరమ్మతులు శనివారం యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. సర్పంచ్ కనగల భారతి, పంచాయతీ కార్యదర్శి నవలాపురపు రామారావు ఆధ్వర్యంలో పాడైన బోర్లను బాగు చేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

పంపిణీకి సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు

వంగర: మండలంలోని అన్ని గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏవో తట్టికోట కన్నబాబు తెలిపారు. స్థానిక పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో అన్ని గ్రామాల వీఏఏలతో శనివారం సమావేశమైన ఆయన.. పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, కట్టెజనుము విత్తనాలను పొలాల్లో వేసుకుంటే భూసారం పెరిగి, పంటలు బాగా పండుతాయన్నారు. 50 రాయితీపై ఇచ్చే ఈ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విస్తారంగా కూరగాయల సాగు

రాజాం: మండలంలోని బొద్దాం, పెనుబాక, ఒమ్మి తదితర గ్రామాల్లోని రైతులు తమ పొలాల్లో విస్తారంగా కూరగాయల సాగు చేస్తున్నారు. టమాటా, వంగ, బెండ పంటలు వేసి, నేలబావులు, విద్యుత్ మోటార్ పంపుసెట్లు సాయంతో సాగుకు నీరందిస్తున్నారు. తక్కువ వ్యవధిలో అధిక దిగుబడులు ఇచ్చే కూరగాయల సాగు మంచి లాభాలు ఇస్తున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగ చిన్నారుల గుర్తింపు సర్వే

చీపురుపల్లిరూరల్(గరివిడి): సమగ్రశిక్ష అభియాన్, విద్యాశాఖ ఆధ్వర్యంలో బడి ఈడు దివ్యాంగ చిన్నారుల గుర్తింపు సర్వేను భవిత కేంద్రాల ప్రత్యేక ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారు.గరివిడి మండలంలోని బి.జె.పాలెం,దేవాడ, కాపుశంబాం గ్రామాల్లో శనివారం చేపట్టిన సర్వేను జిల్లా సహిత విద్య కో–ఆర్డినేటర్ ఎస్.సూర్యారావు, సహ కో–ఆర్డినేటర్ ఎం.భారతి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులైన బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించడమే ఈసర్వే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక సౌకార్యాలు కల్పిస్తోందన్నారు. దివ్యాంగులు చదువుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా మండల కేంద్రంలో భవిత కేంద్రాలను నిర్వహిస్తోందని తెలిపారు.

ఉచితంగా పండ్ల మొక్కల పంపిణీ

రాజాం: ఉపాధి హామీ పథకంలో న్యూ స్ట్రాటజీ వర్క్స్ అమలు జరుగుతున్నాయని, వాటితో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఉపాధి హామీ పథకం ఏపీడీ మీసాల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్లతో శనివారం సమావేశమైన ఆయన.. న్యూ స్ట్రాటజీ పనుల్లో భాగంగా రైతులు తమ పొలాల్లో పండ్లతోటలు పెంచుకునేందుకు ప్రోత్సాహం, ప్రోత్సాహకం కల్పిస్తున్నామన్నారు. మొత్తం 14 రకాల పండ్ల మొక్కలను రైతులకు ఉచితంగా అందిస్తామన్నారు. ఎకరాకు 60 నుంచి 70 వరకు మొక్కలు ఇవ్వనున్నామన్నారు. వీటిని నాటడంతో పాటు మూడేళ్ల పాటు పెంచుకునేందుకు ఏడాదికి రూ.35 వేల వరకు నిధులను ఉపాధి హామీ పథకం ద్వారా అందుతాయన్నారు. మొక్కల ఫలసాయం కూడా రైతులే పొందవచ్చన్నారు. వీటితో పాటు పొలాల చుట్టూ కందకాలు తవ్వుకునేందుకు, చెట్లు, మొక్కలు చుట్టూ కూడా కందకాలు ఏర్పాటుకు రైతులకు నిధులు ఇస్తున్నామన్నారు. వీటి కోసం రైతులు ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎకరం నుంచి మూడెకరాల వరకు పొలాలున్న రైతులు తమ మెట్టు ప్రాంత పొలాల్లో పారంపాండ్‌లు తవ్వుకునేందుకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. 9 మీటర్ల వెడల్పు, 9 మీటర్ల పొడవుతో పాటు లోతు రెండు మీటర్ల మేర తవ్వుకోవాలన్నారు. వీటి నిర్మాణాలకు సైతం రైతులకు రూ.50 వేల వరకు నిధులు వెచ్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీవో కె.సాయిరాం, ఈసీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోజుకు రూ.300 వేతనం



రేగిడి: చిన్నశిర్లాంలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు

రేగిడి: నిర్దేశిత కొలతల ప్రకారం ఉపాధి హామీ పథకం పనులు చేస్తే రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఏపీవో ఎస్.హరనాథరావు తెలిపారు. మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో ఉన్న ఉత్తరావెల్లి చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన శనివారం పరిశీలించారు. వేసవి ఎండల నేపథ్యంలో రోజుకు రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలో మాత్రమే పనులు చేయాలని తెలిపారు. మెట్టు పొలంలో ఉన్న సన్న, చిన్నకారు రైతులు పండ్ల తోటలు వేసుకునేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు ఇస్తున్నామన్నారు.

తెర్లాం: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న ప్రదేశాల్లో తప్పనిసరిగా టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీవో మధుసూదనరావు సూచించారు. మండలంలోని అప్పలంపేటలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన శనివారం పరిశీలించి, కాసేపు వేతనదారులతో మాట్లాడారు. వేసవి ఎండల బారినపడకుండా ఉండేందుకు టెంట్ల నీడ ఉపయోగపడుతుందన్నారు. ప్రతీ వేతనదారు పనికి వెళ్లేటప్పుడు తాగునీటి బాటిల్ వెంట తీసుకువెళ్లాలని తెలిపారు.

బాలికలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి



మాట్లాడుతున్న బొబ్బిలి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రోహిణీరావు

బొబ్బిలి: బాలికలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని బొబ్బిలి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు సూచించారు. ప్రపంచ బాలికల అదృశ్య నివారణా దినం సందర్భంగా మండలంలోని మెట్టవలస గ్రామ సచివాలయంలో బాలికల సంరక్షణపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో ఈ మధ్యకాలంలో బాలికలు, చిన్నారులు, మహిళలు ఎక్కువగా అపహరణకు గురవుతున్నారని, ఎవరైనా అదృశ్యమైన వెంటనే పోలీసులు, న్యాయ సేవా కమిటీకి తెలియజేయాలన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది డి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



వంగర: కె.కొత్తవలసలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ మహేంద్ర



రాజాం సిటీ: గొడవలు పడొద్దని గ్రామస్తులకు సూచనలిస్తున్న సీఐ మోహనరావు

రామభద్రపురం: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లోని గ్రామపెద్దలతో శనివారం సమావేశాలు నిర్వహించి, ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి గొడవలు జరగకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల అనంతరం అందరూ అన్నదమ్ముల్లా మెలగాలన్నారు. ఎన్నికల ఫలితాల కోసం, ఫలితాలు వచ్చిన తర్వాత ఎవరైనా గ్రామాల్లో తగాదాలు సృష్టిస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐ తిరుమలరావు, ఎస్ఐ జ్ఞానప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వంగర: ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మండలంలోని కె.కొత్తవలస, కొండచాకరాపల్లి గ్రామాల్లోని ప్రజలకు ట్రైనీ డీఎస్పీ మహేంద్ర చైతన్యం చేశారు. ఎన్నికల ఫలితాల సమయంలో గానీ ఎన్నికల ఫలితాల తర్వాత గానీ ఎవరూ ఎటువంటి గొడవలు పడొద్దని సూచించారు. అందరూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వై.వి.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి గొడవలు పడకుండా గ్రామాల్లోని ప్రజలు శాంతియుత వాతావరణంలో మెలగాలని రాజాం టౌన్ సీఐ డి.మోహనరావు సూచించారు. మండలంలోని బొద్దాం, గడిముడిదాం, గురవాం గ్రామాల్లోని ప్రజలతో శనివారం సమావేశమైన ఆయన.. పార్టీల మత్తులో గొడవలకు దిగడం, కవ్వింపు చర్యలకు పాల్పడడం వంటివి చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వై.రవికిరణ్, ఏఎస్ఐలు ఎ.లక్షుంనాయుడు, ఎస్.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ ప్రభంజనం ఖాయం



పోలింగ్ సరళిపై రాజాం అమ్మవారి కాలనీ నాయకులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

రాజాం: రాష్ట్రంలోనూ నియోజకవర్గంలోనూ ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని, తాను కూడా ఎమ్మెల్యే అవుతానని పార్టీ రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక పట్టణంలోని ఆయన నివాసంలో రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల పార్టీ నాయకులతో శనివారం సమావేశమైన ఆయన.. ఎన్నికల నిర్వహణ, పోలింగ్ సరళి, ఓటింగ్ జరిగిన విధానంపై చర్చించారు. రాజాం పట్టణంలోని అమ్మవారి కాలనీ, ఆదర్శనగర్ వార్డుల నుంచి అత్యధిక ఓట్లు పార్టీకి పడ్డాయని నాయకులు తెలిపారు. జూన్ 4వ తేదీన విడుదలయ్యే ఫలితాల్లో మన పార్టీ తప్పకుండా విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమాల్లో, ఎన్నికల ప్రచారంలో తనకు అండగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలని ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంపల లక్ష్మణరావు, జేసీబీ శ్రీను, శ్రీహరినాయుడు, మంతపూడి వెంకటరమణ, గొర్లె సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు



మామిడిపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ షేక్ శంఖర్

సంతకవిటి: బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని మామిడిపల్లి, మండాకురిటి, సురవరం గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన.. ఆయా గ్రామాల ప్రజలతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎటువంటి బెట్టింగ్‌లు వేయవద్దని, ఒకరికొకరు వివాదాస్పద వ్యాఖ్యలు చేసుకోవద్దని తెలిపారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు, ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎక్కువగా బెట్టింగ్‌లు జరుగుతున్నాయన్న సమాచారం వస్తోందని, బెట్టింగ్‌లకు పాల్పడే వారి పేర్లు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ నేరగాళ్ల బారినపడవద్దని, అపరిచిత వ్యక్తులు అడిగితే ఓటీపీ(వన్‌టైమ్ పాస్‌వర్డ్) చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ శంఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: ఎన్నికల ఫలితాలపై ఎటువంటి బెట్టింగ్‌లు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని కూనాయవలస, నెమలాం, సుందరాడ గ్రామాల్లోని ప్రజలతో సమావేశమైన ఆయన.. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరగడంలో సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకుండా చూసుకోవాలని గ్రామపెద్దలకు సూచించారు. ఎన్నికలప్పుడు గ్రామాల్లో ఎటువంటి ప్రశాంత వాతావరణం ఉందో ఎన్నికల ఫలితాల తర్వాత కూడా అదే వాతావరణం గ్రామాల్లో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

పాఠశాలల ప్రారంభం నాటికి పనులు పూర్తి కావాలి



నందబలగ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులు



మాట్లాడుతున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈవో జె.త్రినాధరావు, ఎస్ఎస్ఏ మండల ఇన్‌చార్జి ఏఈ కిశోర్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో శనివారం సమావేశమైన వారు.. పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులు, పనుల్లో పురోగతి, నిధుల మంజూరు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి అన్ని పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న నాడు–నేడు పనులను పూర్తి చేయాలన్నారు. ఏ పాఠశాలలోనైనా ఎక్కువగా సిమెంట్ నిల్వలు ఉంటే అవసరమైన పాఠశాలలకు సిమెంట్ ఇవ్వాలని తెలిపారు. సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 పాపారావు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా నిర్మాణ పనులు..

తెర్లాం: మండలంలోని నందబలగ ప్రాథమిక పాఠశాలలో మనబడి నాడు–నేడు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం అదనపు తరగతి గదుల ప్లాస్టింగ్‌లు, ఇతర పనులు చేపడుతున్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరరావు తెలిపారు.

తక్షణమే నిందితులను శిక్షించాలి



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దళిత సంఘ నాయకులు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామానికి చెందిన ఉత్తారవెల్లి సంగాంను హత్య చేసిన వారిని వెంటనే పట్టుకుని, శిక్షించాలని దళిత సంఘం నాయకులు దేబారికి రామప్పడు, బొత్స బుద్దుడు, టీకేటి రామారావులు డిమాండ్ చేశారు. శనివారం ఆ గ్రామానికి వెళ్లిన సదరు నేతలు బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. నిందితులను పట్టుకోవడంలో పోలీసులు అలసత్వం వహించడం తగదన్నారు. వీలైనంత త్వరగా నిందితులను పట్టుకుని, బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాండ్రంకి శ్రీనివాసరావు, తేగల మోహనరావు, ఈసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి చినకాద గ్రామ దేవత పండగ

దత్తిరాజేరు: మండలంలోని చినకాద గ్రామంలో ఈనెల 20వ తేదీ నుంచి మూడు రోజుల పాటు గ్రామ దేవత నలమారమ్మ పండగ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. 20న తొలేళ్ల ఉత్సవం, 21న రథోత్సవం, 22న కనుమ పండగ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.